# మదరాస్ - ఆర్కోణాల మధ్య

• మధుకర్ •

ఆనాటి రాత్రి నేను నా స్వగ్రామానికి బయలు దేరబోతూన్నానని, పగలంతా ఎంతో ఉత్సాహంగా గడిపాను

మేనేజరుగారు స్వగ్రామానికి పోతూన్నారని ఆఫీసులోకూడా అంతా హడావిడిగా ఉంది

నా గుమాస్తాను పిలిచాను.

"యస్ సార్" అంటూ సమీపించాడు మా అరవ గుమాస్తా.

"రెండవ తరగతిలో ఒక 'సీటు' రిజర్వు చేయించండి" అన్నాను—ఒక విధంగా అతణ్ణి ఆజ్ఞాపిస్తూ.

అతివినయంగా "యస్ సార్" అంటూ ఆ గుమాస్తా వెళ్ళిపోయాడు

కొన్ని నిమిషాల్లోనే స్థలం రిజర్వు చేయడానికి వీల్లేదన్న విషయం నా చెవులవఱకూ వచ్చింది.

ద్వానికోసమని ప్రయాణ మాపటం తెలివితక్కువ అనుకొన్నా. అసలు... ఆపటానికికూడా వీల్లేనిది—ఆ ప్రయాణం.

తొమ్మిది—అయిదు నిమిషాలకు నా బండి. సకాలంలోనే స్టేషను చేరుకొన్నా. పది రూపాయల పదకొండణాలిచ్చి, టికెట్ కూడా కొనేశా.

రైలుబండి ప్లాటుఫారముమీదికి రావడానికి ఇంక అయిదు నిమిషాలుమాత్రముంది. దూరంగా వస్తూన్న బండినిచూసి, ప్రయాణీకులు తమ తమ సామాన్లతో సిద్ధంగా ఉన్నారు-పెట్టెలోకి ఉరకటానికి

నేనూ నలుగురితోబాటు నారాయణా అన్నా.

బండి ప్లాట్‌ఫారంమీద ఆగనేలేదు, ఇన్‌టర్‌క్లాసు పెట్టె కళ్ళకగుపడేసరికి నేను, నాతోపాటు మరికొందరు జొరబడ్డాం.

నేను కొందరి కాళ్ళను త్రొక్కి, కొందరితో నా పాదాలను త్రొక్కించుకొని, పెట్టెలో అడుగు బెట్టాను

పెట్టెలో కొంద రప్పుడే పడక లమర్చుకొన్నారు. సమీపంలో ఉన్న ఆయన్ను నాకు చోటు విచ్చమని అడిగాను.

నన్ను చూచి, ఏవిధంగా భావించాడో.... ఆయన నాకు చోటిచ్చాడు.

"త్వరగా రండి ! ఉన్న ఈ స్థలంలోకూడా ఎవరయినావచ్చి కూర్చుంటారు" అన్నా డావ్యక్తి.

ఒకరివెనుక ఒకరుగా ఒక చిన్న గుంపు ఆ స్థలాని కొచ్చింది

"వీళ్ళకంతా ఈ స్థలం చాలదే ?" అన్నట్టు ఆయనవైపు చూచాను.

"ముగ్గురంమాత్రమే" అన్నాడాయన—నా చూపుల్లోని అర్థాన్ని గ్రహించి.

ఒక ముసలామే, ఆమెతోకూడా ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయీవచ్చి, అతని ప్రక్కనే కూర్చున్నారు.

ఆ అమ్మాయి అతని భార్య అని కొన్ని నిముడియల్లోనే గ్రహించుకోగలిగాను ఆ ముస

లమ్మ వాలకమే చెప్పింది ఆమె. ఆ అమ్మాయి అత్తగారని.

ఆ, అమ్మాయి చాలా అందంగా వుంది. ముఖ్యంగా కళ్లు ఆ అమ్మాయికి ఒక విధమైన వింత అందాన్నిస్తున్నై. ఆమె ముఖం కళకళ లాడుతూంది.

గుండ్రంగా పెట్టుకొన్న కుంకుమబొట్టు. కమ్మని వాసనలు వెదజల్లుతూన్న ఆమె జడలోని పూలు, చిరునవ్వు చిందులుత్రొక్కే ఆమె పెదిమలు ఒకటేమిటి, ఆ అమ్మాయి అన్నివిధాలా అందంగా ఉంది .

ఆ అబ్బాయికూడా ఆమెకు తగిన వరుడే అనాలి. ఆయనగారి పర్సనాలిటీ బాగుంది. చదువుకొన్న లక్షణాలుకూడ అతని ముఖంలో తాండవిస్తున్నై.

ఆ అమ్మాయిని అత్తగారింటికి పంపుతూన్నారనీ, ఆ వచ్చిన గుంపంతా ఆమెకు సెన్డ్-ఆఫ్ ఇవ్వటానికి వచ్చిన బృందమనీ. త్వరలోనే గ్రహించుకోగలిగాను.

కొన్ని నిమిషాలు ఆమెవైపు దీక్షగా చూచాను. ఆమె ముఖంలో దుఃఖంగాని, చింతగానీ అగపడలా. పుట్టినిల్లు వదలి వెళ్లుతూన్న ఆడబిడ్డకు అంత నిబ్బరం ఎక్కడిదబ్బా అనుకొన్నా— మనసులో.

కొన్ని నిమిషాలు గడిచినై. వళ్ళంతా చెమటలతో తడిసిపోయింది. ఆ తరగతి పెట్టె ఒక నరకంలాగుంది—ఆ పరిస్థితుల్లో.

చేతిలో ఉన్న వార్తాపత్రికతో విసరుకొన్నా కాస్సేపు దానివల్ల కలిగిన ఉపశమనం చాల తక్కువ అనిపించింది.

క్రమంగా నిమిషాలు గడచినై. బండి కదలటానికి వచ్చిన బంధువర్గం ఒక్కరొక్కరుగా వచ్చి, ఆమెకు సీతులు చెప్పి, ఉత్తరాలు వ్రాస్తూండమని ఆమెను బ్రతిమాలి, వెళ్లుతూన్నారు

ఆమె అదే మందహాసంతో వాళ్ళకు సమాధానా లిస్తూంది. నాకు నిజంగా ఆశ్చర్యమనిపించింది.

బండి కదిలింది. ప్లాట్‌ఫారంమీద ఉన్న బంధువర్గం మరొకతూరి "నిలుస్తాం" అన్నారు.

"ఊ—నిలవండి" అంటూ ఆ అమ్మాయి చేతులు జోడించింది.

ఆమె కళ్ళవెంట బొటబొట బాష్పాలు రాలినై. నేను ఆమెను దీక్షగా గమనిస్తూన్నా. తన అత్త, భర్తలనుండి ఆ కన్నీటిని కప్పిపెట్టాలని ప్రయత్నించింది—ఆ అమ్మాయి.

కళకళలాడుతూన్న ఆమె ముఖాన్ని కారుమబ్బులు కప్పినట్లయింది. ఆనందజ్యోతులను వెదజల్లుతూన్న ఆమె కన్నులు దీనతను, ఆసహాయతను వెల్లడించటం ప్రారంభించినై

నేనంతా గమనించా. "అయ్యో—పాపం!" అనుకొన్నా మనసులో

ఆమెను ఆ పరిస్థితులలో ఓదార్చవలసిన బాధ్యత ఆమె భర్తమీద ఉందనుకొన్నా. ఆమెను ఓదార్చటానికి పూనుకోని అతణ్ణి మనసులో నిందించానుకూడా.

బండి చాలా వేగంగా పోతూంది— యిప్పుడు. ఏవో విషయాలను ఆమె జ్ఞప్తికి తెచ్చుకొంటూ నవ్వుకొంది మళ్ళీ ఇంతలోనే ఆ కారుమబ్బులు ఆమె నావరించినై ఆమె కారుతూన్న కన్నీటిని ఆపుకోలేకపోయింది

నేనూ ఆపు లేకపోయాను. కాని, అతనికి సలహా నివ్వటానికిగూడా నాకు సాహసం లేకపోయింది.

నా చూపులను మళ్ళీ ఆమెవైపు మరల్చాను. ఆమె, దీనంగా—వెనుకకు పరువెత్తుతూన్న వస్తువులను చూస్తూంది.

నా హృదయం కరిగిపోయింది ఇంతలో ఆమెను దీక్షగా గమనిస్తూన్న నా చూపులతో ఆమె చూపులు కలసినై.

ఏమనుకొందో, ఏమో! కన్నీటిని తన పయ్యెదతో తుడుచుకొని, ఆ అమ్మాయి, నన్ను చూచి మెల్లగా నవ్వింది.

, ఇలాంటి చెల్లెలు నాకుంటే ఎంత ఆనందించేవాణ్ణో! అనుకొన్నా నాకొక చెల్లెల్ని ప్రసాదించని భగవంతుని నిందించుకొంటూ.

---

ఆకంగవాణి *